



# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 98,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,ఆదివారం, తేదీ : 09-08-2026


## తిరుపతికి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్.. రూట్ ఫిక్స్ చేసిన రైల్వేశాఖ..



తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు రైల్వేశాఖ మరో శుభవార్త అందించేందుకు సిద్ధమవుతోంది. తిరుపతి మీదుగా ఇప్పటికే పలు వందే భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే.

తిరుపతి :తిరుమలకు వేగంగా చేరుకునేందుకు ఈ రైళ్లు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే త్వరలో తిరుపతికి మరో వందే భారత్ రైలు వచ్చే అవకాశముంది. తాజాగా ట్రయల్ రన్ కూడా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల తిరుపతి రైల్వే స్టేషన్‌లో కొత్త వందే భారత్ రైలు కనిపించింది. రైల్వే స్టేషన్‌లోని పిట్ లైన్‌పై ఇది ఆగింది. మిగతా..2లో

## ఢిల్లీలో డెంగ్యూ H1N1 కేసులు..



ఢిల్లీ ఆసుపత్రులలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులతో కలిపి ఇప్పటివరకు 1,389 డెంగ్యూ కేసులు నమోదు కాగా ఎ1బీ1 కేసుల సంఖ్య 1,344కు చేరింది. ఈ రెండు ఇన్ఫెక్షన్ల వల్ల ఇప్పటివరకు ఎలాంటి మరణాలు సంభవించలేదు.

దీనికి సంబంధించిన లక్షణాలు, ప్రమాద సంకేతాలు, చికిత్స మరియు నివారణ మార్గాలు ఓసారి పరిశీలిస్తే..

ఢిల్లీ వ్యాప్తంగా ఇప్పటివరకు 1,179 డెంగ్యూ కేసులు నమోదు కాగా, నగరంలోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న మరొక 210 మంది రోగులు రాజధాని వెలుపలి ప్రాంతాలకు చెందినవారు. మిగతా..2లో

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు



- ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
- నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
- 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

- సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.
- భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు.
- నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు.



హైదరాబాద్, ఆగస్టు 8 : సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. ఈరోజు (శనివారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. మిగతా..2లో


## దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం



- ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి
- కుటుంబానికి అండగా నిలిచేందుకు కేసీఆర్ కీలక నిర్ణయం
- పిల్లల చదువు, ఆయన తల్లి బాగోగుల కోసం ఆర్థిక సాయం

హైదరాబాద్: ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పరంగా సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తంగా రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం మిగతా..2లో

## దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ, చేసిందేంలేదు నీతులు మాత్రమే చెబుతుంటారు



- స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందన్న కాంగ్రెస్ అధ్యక్షుడు
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేదని ఖర్గే విమర్శ
- రాహుల్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని ప్రశంస

ఢిల్లీ : బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్

## చైనాలో 'క్రమశిక్షణ' కేంద్రాలు.. తల్లిదండ్రుల మాట వినకపోతే నిర్బంధమే!

- చైనాలో మాట వినని పెద్దలైన పిల్లల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు
- ప్రేమ వ్యవహారాలు, నిద్ర వేళల్లో తేడాల వంటి కారణాలతో బలవంతపు నిర్బంధం
- గతంలో ఇంటర్నెట్ బానిసల కోసం ఉన్న కేంద్రాలు ఇప్పుడు కొత్త రూపంలో వ్యాపారం
- ఒక యువతిని ప్రియుడి నుంచి విడదీసేందుకు బలవంతంగా కేంద్రానికి పంపిన తల్లిదండ్రులు



ఢిల్లీ : చైనాలో ఒక వింత, ఆందోళనకరమైన ధోరణి వెలుగులోకి వచ్చింది. పిల్లలు పెద్దయ్యాక తమ మాట వినడం లేదనో, తమకు నచ్చని జీవితాన్ని ఎంచుకున్నారనో భావించే తల్లిదండ్రులు.. తమ సొంత పిల్లలనే బలవంతంగా క్రమశిక్షణ కేంద్రాలకు పంపుతున్నారు. ప్రేమలో పడటం, వీడియో గేమ్‌లు ఎక్కువగా ఆడటం, నచ్చిన ఉద్యోగం చేయడం, సరైన సమయానికి నిద్రపోకపోవడం వంటి కారణాలతో కూడా ఈ కేంద్రాల్లో నిర్బంధిస్తున్నారు. ప్రముఖ ఆన్‌లైన్ మ్యాగజైన్ 'ది డిప్లొమాట్' తన కథనంలో ఈ సంచలన విషయాలను వెల్లడించింది. మిగతా..2లో

## మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు

- డీలిమిటేషన్ కు మద్దతు ప్రకటించిన సుఖ్‌బీర్ సింగ్ బాదల్
- గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన శిరోమణి అకాలీదళ్
- ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు



ఢిల్లీ: శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన మరుసటి రోజే కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు బాదల్ మద్దతు ప్రకటించారు. దీంతో, పంజాబ్‌లో బీజేపీ – అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తోందనే చర్చలు ఊపందుకున్నాయి. ప్రధానితో జరిగిన భేటీ సానుకూలంగా జరిగిందని, పంజాబ్ అభివృద్ధి, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్, ప్రస్తుతం పంజాబ్‌లో మిగతా..2లో

## కుర్చీ కోసం సొంత పార్టీ కార్యకర్తలనే బలితీసుకుంటున్నారు.. జగన్‌పై మంత్రి సవిత ఫైర్




- రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నామని మంత్రి సవిత అన్నారు.
- గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు.

అమరావతి, ఆగస్టు 8: రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నామని మంత్రి సవిత అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ..

# చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
- గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు
- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
- డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి
- పార్టీలో క్రమశిక్షణ తప్పితే జీరో టాలరెన్స్ విధానం ఉంటుందని హెచ్చరిక
- ప్రతి ఎన్నికలోనూ గతంలో కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్య నిర్దేశం



అమరావతి : ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. మిగతా..2లో

## ఏపీపై ఎల్‌నినో పంజా.. కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



- ఏపీలో ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందని షర్మిల ఆందోళన
- ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శ
- రాష్ట్రంలో 69 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, 50 లక్షల ఎకరాలు ప్రభావితమయ్యాయని వెల్లడి
- రైతులకు నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్ సహా పలు డిమాండ్లు
- వెంటనే స్పందించకుంటే రైతులు, ఇతర వర్గాలతో కలిసి సర్కారు వెన్ను విరుస్తామని హెచ్చరిక

# మునగాల జాతీయ రహదారి-65పై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**బ్లాక్ స్పాట్లను పరిశీలించిన ఎస్పీ నరసింహ ఐపీఎస్**

**అజాగ్రత్త, నిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం: ఎస్పీ నరసింహ**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** మునగాల మండల పరిధిలోని జాతీయ రహదారి--65పై ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ప్రమాద స్థలాన్ని, తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. గురువారం రాత్రి ముఖుందాపురం వద్ద ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురై తండ్రి, కుమారుడు మృతి చెందిన ఘటనపై సంఘటనా స్థలాన్ని శనివారం మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి, జాతీయ రహదారుల అధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాధవరం స్టేజి, మొద్దులచెరువు స్టేజి, మునగాల, ముఖుందాపురం, ఆకుపాముల ప్రాంతాల్లోని బ్లాక్ స్పాట్లను పరిశీలించి, ప్రమాదాలకు కారణమవుతున్న లోపాలను గుర్తించి వెంటనే సరిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. పశువులను రహదారులపైకి వదలకూడదని, వ్యవసాయ పనులకు వెళ్లే వాహనాలు తప్పుడు మార్గాల్లో ప్రయాణించకూడదని, గ్రామాల పరిధిలో వేగ నియంత్రణ పాటించాలని కోరారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడటం, మెసేజ్‌లు చేయడం పూర్తిగా మానుకోవాలని, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించాలని తెలిపారు. వాహనాల బ్రేకులు, లైట్లు, టైర్ల కండిషన్‌ను క్రమం తప్పకుండా పరిశీలించుకోవాలని, రాత్రి వేళల్లో అవసరమైనప్పుడే హైబీమ్ లైట్లు వినియోగించి ఎదుటి వాహనదారులకు ఇబ్బంది కలిగించకుండా చూడాలని సూచించారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరస్పరం సహకరించాలని ఎస్పీ కోరారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో అధికారులు తీసుకునే చర్యలతో పాటు ప్రజలు పాటించే జాగ్రత్తలు కూడా అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ నరసింహ పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి, జాతీయ రహదారుల అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అచ్చినయుడులోవ టిడ్కో ఇళ్ల ఘాట్ రోడ్డు పనులకు

**శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ గణబాబు**



**ప్రజా న్యూస్ ఆగస్టు 08:విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు :** విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అచ్చినయుడులోవ టిడ్కో గృహ సముదాయానికి గాజువాక వైపు నుంచి రూ. 13.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 4 కిలోమీటర్ల ఘాట్ (సి.సి. అప్రోచ్) రోడ్డు నిర్మాణ పనులకు శనివారం విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు గణబాబు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ. అచ్చినయుడు లోవ ఎత్తైన కొండ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారులు త్వరలోనే గృహ ప్రవేశాలు చేసేందుకు వీలుగా మౌలిక వసతుల కల్పన వేగవంతంగా జరుగుతోందని తెలిపారు.ఇప్పటికే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా పనులు పూర్తయిందని, ఎస్.టి.పి, నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని వివరించారు.ఆర్టీసీ బస్సులు నేరుగా టిడ్కో కాలనీకి చేరుకునే విధంగా ఈ ఘాట్ రోడ్డును మోడల్ రోడ్డుగా తీర్చిదిద్దుతున్నామని, 3 నుండి 4 నెలల్లో ఈ పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా కాలనీవాసులకు రేషన్ డిపో, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్లే గ్రౌండ్స్ వంటి అన్ని కనీస వసతులను అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. పేదలకు త్వరితగతిన పూర్తిస్థాయి సౌకర్యాలతో ఇళ్లను అందించి, వారి కలలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# బాధిత వికలాంగుడికి అండగా హుజూర్‌నగర్ పోలీసులు




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** హుజూర్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన ఇందిరాల పిచ్చయ్యకు హుజూర్‌నగర్ పోలీసులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. గత నెలలో పిచ్చయ్య తన నివాసం బయట ట్రై సైకిల్‌ను పార్కింగ్ చేసి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తి వాహనంతో ఢీకొనడంతో ట్రై సైకిల్ తీవ్రంగా దెబ్బతిని పూర్తిగా వినియోగానికి పనికిరాకుండా పోయింది. దీంతో వికలాంగుడైన పిచ్చయ్య తన రోజువారీ అవసరాల కోసం బయటకు వెళ్లేందుకు, వ్యక్తిగత పనులు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న హుజూర్‌నగర్ పోలీసులు సమస్యను మానవీయ కోణంలో పరిశీలించి వెంటనే స్పందించారు. ట్రై సైకిల్ లేకపోవడంతో పిచ్చయ్య ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, అతనికి అత్యవసరంగా ట్రై సైకిల్ అవసరమని భావించారు. దాతల సహకారంతో నూతన ట్రై సైకిల్‌ను సమకూర్చి శనివారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా బాధితుడు ఇందిరాల పిచ్చయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ప్రజలకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు పోలీస్ శాఖ అండగా ఉంటుందని, ముఖ్యంగా ఇబ్బందుల్లో ఉన్న బాధితులకు సాధ్యమైనంత సహాయం అందించేందుకు పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. దాతల సహకారంతో వికలాంగుడైన పిచ్చయ్యకు నూతన ట్రై సైకిల్ అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను కేవలం ఫిర్యాదులుగా కాకుండా మానవీయ దృక్పథంతో అర్థం చేసుకుని పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ట్రై సైకిల్ అందుకోవడంతో పిచ్చయ్య ఆనందం వ్యక్తం చేస్తూ తన పరిస్థితిని అర్థం చేసుకుని స్పందించిన పోలీసులకు, నూతన ట్రై సైకిల్ అందించేందుకు సహకరించిన దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం తన రోజువారీ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని, ఇకపై తన అవసరాల కోసం బయటకు వెళ్లేందుకు కొంత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. పోలీసుల చొరవతో బాధితుడికి అవసరమైన సహాయం అందడంతో స్థానికులు కూడా పోలీసుల మానవతా దృక్పథాన్ని అభినందించారు. ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు అవసరమైన సమయంలో అండగా నిలవడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెరుగుతుందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ టూ టౌన్ ఎస్ఐ హనుమాన్ నాయక్, ఏఎస్ఐ బలరాం రెడ్డి, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీల ఆత్మగౌరవ మహా ధర్నాను విజయవంతం చేయాలి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** ఎస్సీ, ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్ సాధన కోసం ఈనెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ఎస్సీల ఆత్మగౌరవ మహా ధర్నాను విజయవంతం చేయాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది తల్లమల్ల హసేన్ పిలుపునిచ్చారు. తెలంగాణలోని 59 ఎస్సీ కులాల సోదర సోదరీమణులు ఐక్యంగా ముందుకు వచ్చి ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మేధావులు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ హక్కుల కోసం గళమెత్తాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రకటించిన డిక్లరేషన్‌లోని హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచినప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తల్లమల్ల హసేన్ విమర్శించారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీల హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తే ఎస్సీ కులాలన్నీ ఐక్యంగా ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకొచ్చి తమ హక్కులను సాధించుకుంటాయని స్పష్టం చేశారు.

# గరిడేపల్లిలో పోలీసుల పకడ్బందీ తనిఖీలు..



**సూర్యాపేట జిల్లా,ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** గరిడేపల్లి నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని ప్రధాన రహదారులపై వాహనాలను నిలిపి పకడ్బందీగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా కార్లు, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ వాహనాల పత్రాలు, ప్రయాణికుల వివరాలు, వాహనాల రాకపోకలపై ఆరా తీశారు. నేరాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినా, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో ఘనంగా వెంకటాచారి జన్మదిన వేడుకలు



**గుర్రంపోడు మండల రిపోర్టర్,ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** గుర్రంపోడు మండలం మక్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు నారోజు వెంకటాచారి జన్మదిన వేడుకలు శనివారం హాలియాలో నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ వెంకటాచారిని శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వెంకటాచారి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, భవిష్యత్తులో ప్రజా జీవితంలో ఉన్నతమైన పదవులు చేపట్టి మరింత సేవ చేయాలని నోముల భగత్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెంకటాచారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుర్రంపోడు మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు, సర్పంచులు అందుగుల శ్రీనయ్య, ఉమారాణి అభినయ్, స్వప్న భాస్కర్, చెవ్వ రమేష్, బీఆర్ఎస్ నాయకులు నాగులవంచ నాగేశ్వరరావు, కామల్ల రాములు, కూనూరి సైదిరెడ్డి, దోటి గణేష్, జక్కల సైదులు, నేతాళ్ల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నందికొండలో వరుణ యాగానికి ఏర్పాట్లు ముమ్మరం

**యాగస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి..**



**నాగార్జునసాగర్,ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నందికొండ మున్సిపాలిటీ విజయ విహార్ ప్రాంగణంలో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న “రైతాంగ సంక్షేమం--రాష్ట్ర సుభిక్షం కొరకు మహోన్నత వరుణ యాగం” కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో యాగస్థలం, వేదిక, భద్రతా ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఆర్డీవోతో పాటు వివిధ శాఖల అధికారులు యాగస్థల పరిశీలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాగ నిర్వహణకు సంబంధించి అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే, అక్కడ తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, భక్తులు, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి యాగ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచనలు చేశారు. యాగ కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా దిగ్విజయంగా పూర్తయ్యేలా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ఆదేశించారు.

# పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే నా ఏకైక లక్ష్యం బొంగునూరి కిషోర్ రెడ్డి




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్వర్క్** గాజులరామారం డివిజన్లో బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 55 వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథులుగా ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. గాజులరామారం పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గంట శివ రెడ్డి, కిషోర్, దేగల సతీష్ బాబు శ్రీధర్ రెడ్డి, కావలి గణేష్ సాధు యాదవ్,నవీన్ రెడ్డి నర్సింహారెడ్డి, రంజిత్ రెడ్డి జగదీష్, సురేష్, నరేష్ సాయి, శ్రీరామ్, ప్రుధ్వి చైతన్య వెల్ఫేర్ సొసైటీ టీమ్ -- టీమ్ బికెఆర్ సభ్యులు స్థానిక ప్రజలు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న హుజూర్‌నగర్‌లో జైలు భరో కార్యక్రమం



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** హుజూర్‌నగర్ కార్మికుల హక్కుల పరిరక్షణ, కార్మిక సంక్షేమ బోర్డు నిధుల సంరక్షణతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10న హుజూర్‌నగర్‌లో నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం హుజూర్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా పిలుపునిచ్చారు. హుజూర్‌నగర్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్మిక సంక్షేమ బోర్డు నిధులను పరిరక్షించాలని, సీసీసీ ఆరోగ్య పథకాలను రద్దు చేయాలని, జీవో నం.12ను సవరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే కార్మికులకు పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఇళ్ల నిర్మాణం, విద్యా సహాయం తదితర సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్మికుడు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని, హక్కుల సాధన కోసం జరిగే పోరాటంలో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్మిక ఐక్యతను చాటాలని షేక్ ముస్తఫా కోరారు. గ్రామ గ్రామం నుంచి కార్మికులు స్వచ్ఛందంగా తరలివచ్చి జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కొత్త పింఛన్లలో అర్హులైన వృద్ధులకు అవకాశం కల్పించాలి -షేక్ సిరాజ్




**గుర్రంపోడు,ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** కొత్తగా మంజూరు చేయనున్న పింఛన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ, అర్హత కలిగిన పలువురు వృద్ధులకు పింఛన్ జాబితాలో అవకాశం దక్కకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ మండల మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు షేక్ సిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి పింఛన్ ఎంతో కీలకమైన ఆసరా అని పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త పింఛన్ల జాబితాలో అర్హులైన వృద్ధుల పేర్లు లేకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు.వృద్ధులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అర్హత ఉన్నప్పటికీ పింఛన్ అందని వారిని గుర్తించి ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్హత కలిగిన ప్రతి వృద్ధునికి కొత్త పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని షేక్ సిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ముడుసు యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**సూర్యాపేట జిల్లా,ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** హుజూర్ నగర్ పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్ సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరానికి సుమారు 200 మంది హాజరై ప్రముఖ కంటి వైద్య నిపుణులతో కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి చూపు లోపాలు, వృద్ధాప్యంతో వచ్చే సమస్యలు, ఇతర కంటి సంబంధిత సమస్యలను వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి తగిన వైద్య సూచనలు అందించారు. పరీక్షల అనంతరం 30 మందిని క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలకు అర్హులుగా గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేయించేందుకు సిఫారసు చేశారు. ఇందులో తొలి విడతగా 10 మందిని ఖమ్మంలోని శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్‌కు ఉచిత కంటి శస్త్రచికిత్స కోసం పంపించారు. మిగిలిన అర్హులకు కూడా దశలవారీగా ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన పలువురికి ఉచితంగా కళ్లజోళ్లు, ఐ డ్రాప్స్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి వైద్యం పొందలేని పేద, మధ్యతరగతి ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐతో పాటు వివిధ ఇన్సూరెన్స్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని కోరారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ సైదా, టీడీపీ నాయకులు షేక్ అలీ, పొనుగుపాటి సత్యనారాయణ, సయ్యద్ రఫీ, శాఖమూరి పవన్ కుమార్, మాజీ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు ఎల్లమ్మ వెంకటేశ్వర్లు, బాబా, నాగుల్ మీరా, మాక్స్ విజన్ సిబ్బంది డాక్టర్ హరీష్, ఎల్లావుల శివ, షరీఫ్, అనీఫ్, పాస్టర్ గోపి, రాజు, చిలకరాజు సైదులు, శ్రీకాంత్, ప్రేమానందం, సంజు, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సులో పాలకీడు వాసి డా. రావుల కృష్ణయ్య



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** సూర్యాపేట జిల్లా పాలకీడు మండలానికి చెందిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రావుల కృష్ణయ్య అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన సస్టైనబుల్ ఎడ్యుకేషన్ సదస్సులో పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రత్యేక గుర్తింపు పొందారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని సామాజిక శాస్త్రాల పాఠశాల, విద్య మరియు విద్యా సాంకేతిక విభాగానికి చెందిన డా. రావుల కృష్ణయ్య తన పరిశోధక విద్యార్థి సాక్షితో కలిసి విశ్వవిద్యాలయం తరపున 3వ అంతర్జాతీయ సస్టైనబుల్ ఎడ్యుకేషన్ సదస్సు (ఐ సి యస్ ఈ 2026)లో పాల్గొన్నారు. ఆగస్టు 5న శ్రీలంకలోని ఇన్ఫర్మాటిక్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన సదస్సులో (ఐ ఎన్ టి ఐ )ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సుకు శ్రీలంకలోని ఇన్ఫర్మాటిక్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆతిథ్యం ఇచ్చింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి పరిశోధకులు, విద్యావేత్తలు, అధ్యాపకులు పాల్గొని సుస్థిర విద్యకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. డా. రావుల కృష్ణయ్య సమర్పించిన పరిశోధనలో సమగ్ర విద్య, సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించే బోధనా విధానాల ప్రాధాన్యతను వివరించారు. విభిన్న అభ్యాస అవసరాలను గుర్తించి ప్రతి విద్యార్థికి సమానమైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు, భవిష్యత్ ఉపాధ్యాయులను సుస్థిర అభివృద్ధికి అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఇటువంటి విద్యా విధానాలు కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలో పేర్కొన్నారు. సమానత్వం, విద్యార్థి కేంద్రిత అభ్యాసం, సాంస్కృతిక వైవిధ్యానికి గౌరవం వంటి అంశాలు నాణ్యమైన విద్యకు ఎంతో అవసరమని పరిశోధన స్పష్టం చేసింది. అంతర్జాతీయ వేదికపై పరిశోధనా పత్రం సమర్పించడం ద్వారా హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిశోధన రంగంలో అంతర్జాతీయ సహకారాలను బలోపేతం చేస్తూ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విద్యా రంగంలో నూతన ఆలోచనలు, పరిశోధనలను ప్రోత్సహిస్తున్నదని మరోసారి వెల్లడైంది. ఈ సందర్భంగా డా. రావుల కృష్ణయ్య, పరిశోధక విద్యార్థి సాక్షిని పలువురు విద్యావేత్తలు, అధ్యాపకులు, స్థానికులు అభినందిస్తూ వారి భవిష్యత్ విద్యా, పరిశోధనా ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# అనుష్క కోసం రాసిన కథ..

ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్ (KJQ)' ఒకటి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు.మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది.






# వరల్డ్ వైడ్ ప్రేక్షకుల కోసం 'రామాయణ'..

భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న పాన్‌వరల్డ్ ప్రాజెక్ట్ 'రామాయణ' పై రోజు రోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్, నేచురల్ స్టార్ సాయిపల్లవి, కన్నడ స్టార్ యష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేయాలనే లక్ష్యంతో రూపొందుతున్న ఈ సినిమా నుంచి తాజాగా మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించిన నేపథ్యంలో, చిత్రబృందం ఇప్పుడు ఇంగ్లీష్ వెర్షన్ ట్రైలర్‌ని విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఈ ట్రైలర్‌ను ప్రత్యేకంగా రూపొందించారు.ఈ ప్రమోషనల్ కంటెంట్ కోసం ప్రముఖ హాలీవుడ్ స్టూడియో సోనీ పిక్చర్స్‌తో మేకర్స్ చేతులు కలపడం విశేషంగా మారింది. దీంతో అంతర్జాతీయ స్థాయిలో సినిమాకు మరింత విస్తృత ప్రచారం లభించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఇంగ్లీష్ ట్రైలర్‌లో మరో ప్రత్యేకత కూడా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాయంతో నటీనటుల లిప్ మూవ్‌మెంట్స్‌ను ఇంగ్లీష్ డైలాగ్‌లకు అనుగుణంగా మార్చినట్లు తెలుస్తోంది. దీంతో డబ్బింగ్ చేసిన అనుభూతి కాకుండా, నేరుగా ఇంగ్లీష్‌లోనే నటించినట్లుగా ట్రైలర్ కనిపిస్తోందని ప్రేక్షకులు అభిప్రాయ పడుతున్నారు. భారతీయ సినిమాల్లో ఈ తరహా టెక్నాలజీని ఇంత పెద్ద స్థాయిలో వినియోగించడం విశేషంగా చెప్పుకోవచ్చు.ఇంగ్లీష్ ట్రైలర్‌తో పాటు చిత్రబృందం సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. 'రామాయణం' ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 6న భారీ స్థాయిలో విడుదల కానుందని వెల్లడించింది. భారతదేశంతో పాటు పలు అంతర్జాతీయ మార్కెట్లలో ఒకేసారి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యష్ రావణుడిగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, ప్రమోషనల్ విజువల్స్ ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించాయి. ఇక ఈ చిత్రానికి హాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. భారతీయ ఇతిహాసాన్ని అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ప్రపంచ ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇంగ్లీష్ ట్రైలర్ విడుదలతో పాటు సోనీ పిక్చర్స్ భాగస్వామ్యం కూడా సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో మరింత హైప్‌ను తీసుకొచ్చింది.

# ధనుష్‌కు జోడీగా కరీనా కపూర్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బాలీవుడ్‌లోనూ వరుస సినిమాలతో తనదైన ముద్ర వేస్తున్నారు. తమిళం, తెలుగు చిత్రాలతో పాటు హిందీ ప్రాజెక్ట్‌లకూ సమాన ప్రాధాన్యం ఇస్తున్న ఆయన, ఇప్పుడు మరో ప్రతిష్ఠాత్మక బాలీవుడ్ చిత్రానికి సిద్ధమవుతున్నారు. ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో తెరకెక్కనున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రాన్ని 'ఇరుంబు తిరై', 'సర్దార్' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన తమిళ దర్శకుడు పీ.ఎస్. మిత్రన్ రూపొందించనున్నారు. బాలీవుడ్‌లో ఆయనకు ఇదే తొలి చిత్రం కానుంది. మైథలాజికల్ అంశాలను జంగిల్ అడ్వెంచర్ కథతో మేళవిస్తూ ఈ సినిమాను భారీ స్థాయిలో రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రబృందం స్క్రిప్ట్ పనులను పూర్తి చేసే దశలో ఉంది.బాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం, ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం స్టార్ నటి కరీనా కపూర్ ఖాన్‌ని మేకర్స్ సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. కథ నచ్చడంతో కరీనా కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం లేదా కరీనా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంజయ్ లీలా భన్సాలీ, కరీనా కపూర్ కలిసి పని చేయాలనే చర్చలు గతంలో కూడా జరిగాయి. ముఖ్యంగా 'దేవదాస్' సినిమా సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన విభేదాల తర్వాత మళ్లీ కలిసి పనిచేసే అవకాశం రాలేదు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలు నిజమైతే, దాదాపు 24 ఏళ్ల తర్వాత భన్సాలీ దర్శకత్వం లేదా నిర్మాణంలో కరీనా నటించే తొలి ప్రాజెక్ట్‌గా ఈ చిత్రం నిలవనుంది.





# రాకా షూటింగ్‌కు ఇబ్బందులా..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ప్లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది.దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీపికా పదుకొణె మెటర్నటీ బ్రేక్ సినిమా పనులపై ఎలాంటి ప్రభావం చూపకుండా చిత్రబృందం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.